## రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు 8125972476

క్విక్ టుడే



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక 290 | సోమవారం 14 జూలై 2025 | వెల : 3 రూ/.. | పేజీలు - 8




## 192 పరుగులకే కుప్పకూలిన ఇంగ్లాండ్

రెండో ఇన్నింగ్స్ లో బ్యాటింగ్‌కు దిగిన భారత్

ఛేజింగ్ లో యశస్వీ జైస్వాల్ డకౌట్ 2



# తీన్మార్ మల్లన్నపై దాడి





**ఎమ్మెల్సీ కవితపై మల్లన్న అనుచిత వ్యాఖ్యలు**

**తెలంగాణ జాగృతి కార్యకర్తల నిరసన**

**గాలిలోకి కాల్పులు జరిపిన ఎమ్మెల్సీ గన్‌మెన్**

**నేలపై రక్తపు మరకలు, ధ్వంసమైన ఫర్నీచర్**

**తీవ్రంగా స్పందించిన తీన్మార్ మల్లన్న**

హైదరాబాద్, జూలై13 (క్విక్ టుడే న్యూస్):
ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడికి దిగారు. పీర్జాదిగూడలోని క్యూ న్యూస్ కార్యాలయంపై ఆదివారం కొందరు కార్యకర్తలు కార్యాలయంలోకి ప్రవేశించి ఫర్నీచర్, కంప్యూటర్లను ధ్వంసం చేశారు. అడ్డుకున్న క్యూ న్యూస్ సిబ్బందిపైనా దాడి చేశారు. దాడి సమయంలో తీన్మార్ మల్లన్న ఆఫీసులోనే ఉన్నారు. ఎమ్మెల్సీ మల్లన్న గన్ మెన్లు గాల్లోకి కాల్పులు జరిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్యూ న్యూస్ ఆఫీసును పరిశీలించారు. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు. కాగా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగానే ఈ దాడి జరిగిందని, జాగృతి కార్యకర్తలే దాడి చేసినట్లు ఒప్పుకున్నారు. దాడి ఘటనలో జరిగిన బీభత్సం, కార్యాలయంలో రక్తపు మరకలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. కాగా దాడిపై తీన్మార్ మల్లన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత అనుచరుల దాడిలో తన చేతికి కూడా గాయమైందని వెల్లడించారు. తన గన్ మన్ నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఇటువంటి దాడులతో బీసీ ఉద్యమం

మిగతా 2లో



# కూలిన కోట

## నవరసాల నటుడు కోట శ్రీనివాసరావు కన్నుమూత

**అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన విలక్షణ నటుడు**

హైదరాబాద్, జూలై13 (క్విక్ టుడే న్యూస్):
విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు ఈ ఉదయం కన్నుమూశారు. వందలాది సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసి 'కోట'గా చిరపరిచి తులైన ఆయన ఆదివారం తెల్లవారుజామున ఫిలింనగర్‌లోని ఆయన నివాసంలో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 83 సంవత్సరాలు. కోట శ్రీనివాసరావు 1942 జులై 10న కృష్ణా జిల్లా కంకిపాడులో జన్మించారు. 1968లో రుక్మిణిని వివాహం చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కొడుకు కోట ప్రసాద్ 21 జూన్ 2010లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. నాలుగు దశాబ్దాలపాటు తెలుగు తెరను ఏలిన ఆయన 750కి పైగా సినిమాల్లో నటించారు. కోట శ్రీనివాసరావు సినిమాల్లోకి రాకముందు భారతీయ స్టేట్ బ్యాంకులో పనిచేశారు. తన నటనతో విలనిజానికి కొత్త భాష్యం చెప్పిన ఆయన రంగస్థల నటుడిగా ఎన్నో ఏళ్లపాటు అలరించారు. ప్రాణం ఖరీదు సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. కెరియర్ తొలినాళ్లలో సహాయ

మిగతా 2లో

# తీన్మార్ మల్లన్న సభ్యత్వాన్ని రద్దు చేయాలి



**శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత ఫిర్యాదు**

**వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా, కించపరిచేలా తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు**

హైదరాబాద్, జూలై13 (క్విక్ టుడే న్యూస్):
అసభ్య పదజాలం వాడిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సభ్యత్వాన్ని రద్దు చేసి, ఆయనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ లోని గుత్తా సుఖేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఫిర్యాదు లేఖ ఇచ్చారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా, కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై "కమిటీ ఆన్ ఎథిక్స్"కు రెఫర్ చేయాలని కోరారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని రెండేళ్లుగా నేను ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు ఢిల్లీ వేదికగా బీసీ గొంతుకగా నిలిచాను. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని బలంగా గొంతు వినిపించానని తెలిపారు. తెలంగాణ జాగృతి చేసిన ఉద్యమాలకు దిగివచ్చే రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2లో



# అమ్మకు బోనం

**వైభవోపేతంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు**

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, జూలై13 (క్విక్ టుడే న్యూస్):
సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాల పండుగా ఆదివారం వైభవోపేతంగా జరిగింది. లష్కర్ బోనాల సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పలువురు కేబినెట్ సహచరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సాంప్రదాయ బద్ధంగా, ఉత్సాహంగా ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు. మహిళా భక్తులు అన్నం, బెల్లం, పెరుగు, వేప ఆకులతో వండిన 'బోనం'ను అమ్మవారికి సమర్పించారు. ఆలయం, దాని చుట్టుపక్కల వీధులన్నీ పండుగ వాతావరణంతో నిండిపోయాయి. సంప్రదాయ వస్త్రధారణతో ఉన్న మహిళలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మహిళా భక్తుల కోసం

మిగతా 2లో



# నేడు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**సూర్యాపేట జిల్లా తిరుమల గిరిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**పదేళ్ల తర్వాత కొత్తగా 3.58 లక్షల రేషన్ కార్డుల జారీ**

హైదరాబాద్, జూలై13 (క్విక్ టుడే న్యూస్):
దాదాపు పదేళ్ల తర్వాత తెలంగాణలో కొత్తగా 3.58 లక్షల రేషన్ కార్డులను ప్రభుత్వం జారీ చేయనుంది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో సీఎం రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించనున్నారు. సోమవారం సాయంత్రం తిరుమలగిరి బహిరంగసభ వేదికగా సీఎం లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. కొత్తగా జారీ చేస్తున్న రేషన్ కార్డులతో కలిపితే తెలంగాణలో మొత్తం కార్డులు 95,56,625కు చేరనుండగా లబ్ధిదారులు 3 కోట్లు దాటనున్నారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల తెలిపారు. కానీ కొన్ని రోజుల కింద చెప్పినట్లుగా రెండు రకాల కార్డులు జారీ చేస్తారా.. లేక మొత్తం ఒకే రకమైన కార్డులు జారీ చేస్తారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. గత కొన్నేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు కొత్త కార్డుల పంపిణీ ద్వారా తమ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు దఫాలుగా తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుంది. ఈ ఏడాది జనవరి 26న

మిగతా 2లో



# రైల్వే బోగీల్లో సీసీ కెమెరాలు

**ప్రయాణికుల భద్రతపై రైల్వే శాఖ కీలక నిర్ణయం**

**74 వేల రైలు కోచ్ లలో సీసీ కెమెరాలు**

న్యూఢిల్లీ, జూలై13:
రైల్వే ప్రయాణికుల భద్రతకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న 74వేల రైలు కోచ్‌లలో త్వరలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తలుపుల వద్ద ఈ కెమెరాలు అమర్చనున్నారు. దీంతో ప్రయాణికుల భద్రతను గణనీయంగా మెరుగుపరుస్తుందని, ప్రయాణికులను లక్ష్యంగా చేసుకునే దుండగులు, ముఠాలను నిరోధిస్తుందని అధికారులు తెలియజేస్తున్నారు. నార్తర్న్ రైల్వేలో లోకో ఇంజన్లు, కోచ్‌లలో విజయవంతంగా సీసీటీవీ కెమెరాల ట్రయల్స్ నిర్వహించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. శనివారం జరిగిన ఒక సమావేశంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్నీత్ సింగ్

మిగతా 2లో

# ఏపీలో ఘోర రోడ్డు ప్రమాదం

## లారీ బోల్తా పడి 9మంది మృతి



రాయచోటి, జూలై13 (క్విక్ టుడే న్యూస్):
ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మామిడి కాయల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో 9 మంది మృతిచెందగా, మరికొందరు కూలీలు గాయపడ్డారు. రాజంపేట నుంచి రైల్వేకోడూరు మార్కెట్ కు మామిడికాయల లోడుతో లారీ వెళ్తోంది. ఈ క్రమంలో రెడ్డిపల్లి చెరువు కట్టపై లారీ అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో లారీలో 16 మంది వరకు మామిడికాయలు కోసే కూలీలు ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్య సహాయం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

తరువాయి పేజీ..



## తీన్మార్ మల్లన్న సభ్యత్వాన్ని రద్దు చేయాలి

శాసన సభ, శాసన మండలిలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు వేర్వేరు బిల్లులు ప్రవేశ పెట్టి ఆమోదించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం లో నిర్వహించిన సంబురాలపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. చట్టసభలో సభ్యురాలినైనా నాపైనే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నఈ తరహా వ్యాఖ్యలు చేశారంటే సమాజంలోని సామాన్య మహిళల విషయంలో ఆయన ఎలాంటి భావనతో ఉంటారో అర్థం చేసుకోవచ్చు అని పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న నాపై చేసిన అనుచిత వ్యాఖ్యలను శాసన మండలిలోని ఎథిక్స్ కమిటీకి రెఫర్ చేయాలని రూల్ నెంబర్ 262–సీ, సబ్ రూల్ 1 కింద కోరుతున్నాను' అని ఎమ్మెల్సీ కవిత ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో పాటు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన కామెంట్లకు సంబంధించిన పెన్ డ్రైవ్, ట్రాన్స్ క్రిప్ట్ కూడా అందజేసినట్లు తెలిపారు. తీన్మార్ మల్లన్న మాట్లాడిన మాటలకు మా జాగృతి నేతలకు కోపం వచ్చి నిరసన తెలిపారని వివరించారు. అంత మాత్రనికే గన్ ఫైర్ చేసి చంపేస్తారా! దీనిని ఖండించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే సీఎం రేవంత్ రెడ్డి దీనిని వెనుకనుంచి నడిపిస్తున్నట్లు భావించాల్సి వస్తుందని తెలిపారు.

## రైల్వే బోగీల్లో సీసీ కెమెరాలు



బిట్టూ, రైల్వే బోర్డు అధికారులు లోకోమోటివ్‌లు, కోచ్‌లలో సీసీటీవీ కెమెరాల ట్రయల్స్ ఏర్పాటు పురోగతిని సమీక్షించారు. ప్రతి రైలు కోచ్‌కు డోమ్ తరహా నాలుగు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఒక్కో ప్రవేశ మార్గంలో రెండు కెమెరాలు ఉంటాయి. అదేవిధంగా, ప్రతి లోకోమోటివ్‌లో ఆరు సీసీటీవీ కెమెరాలు ఉంటాయి. వీటిలో ఒకటి ముందు వైపు, ఒకటి వెనుక వైపు అమర్చుతారు. లోకోలోని ఒక డోమ్ సీసీటీవీ కెమెరా, రెండు డెస్క్ మౌంటెడ్ మైక్రోఫోన్‌లు అమర్చనున్నారు. గంటకు 100 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించే రైళ్లలో కూడా దృశ్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని వైష్ణవ్ రైల్వే అధికారులను కోరారు. ఇండియా ఏఐ మిషన్‌తో భాగస్వామ్యం, సీసీటీవీ కెమెరాల ద్వారా సేకరించిన డేటాపై కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని అన్వేషించాలని రైల్వే మంత్రి అధికారులను ఆదేశించారు.

## నేడు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

నాలుగు పథకాలు ప్రారంభించిన సమయంలోనే గ్రామ సభలు నిర్వహించి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. మీ సేవా కేంద్రాల్లోనూ రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఏప్రిల్ నెలలోనే రేషన్ కార్డులు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. పలు దఫాలు ఈ కార్యక్రమం వాయిదా పడుతూ వచ్చింది. కొత్త రేషన్ కార్డులతో ప్రభుత్వ ఖజానాపై ఏడాదికి అదనంగా రూ.1150.68 కోట్ల భారం పడనుంది. జనవరి 26న

### 192 పరుగులకే
## కుప్పకూలిన ఇంగ్లాండ్

**రెండో ఇన్నింగ్స్ లో బ్యాటింగ్‌కు దిగిన భారత్**

**ఛేజింగ్ లో యశస్వీ జైస్వాల్ డకౌట్**

**న్యూఢిల్లీ, జూలై13:**

నాలుగో రోజు లార్డ్స్ టెస్టు ఆటలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఇంగ్లండ్ తన రెండో ఇన్నింగ్స్ లో కేవలం 192 పరుగులకే కుప్పకూలింది. టీమిండియా ఆఫ్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ 4 వికెట్లతో ఇంగ్లండ్ పనిబట్టాడు. బుమ్రా 2, సిరాజ్ 2, నితీశ్ కుమార్ రెడ్డి 1, ఆకాశ్ దీప్ 1 వికెట్ తీశారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ లో జో రూట్ 40 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ 33, హ్యారీ బ్రూక్ 23, ఓపెనర్ జాక్ క్రాలీ 22 పరుగులు చేశారు. ఓలీ పోప్ (4), వికెట్ కీపర్ బ్యాట్స్ మన్ జేమీ స్మిత్ (8) విఫలమయ్యారు. ఇక, 193 పరుగుల విజయలక్ష్యంతో టీమిండియా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. అయితే, ఇంగ్లండ్ ఎక్స్ ప్రెస్ పేస్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ఆరంభంలోనే భారత్ ను దెబ్బకొట్టాడు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0) ఖాతా తెరవకముందే పెవిలియన్ కు పంపించాడు. ప్రస్తుతం టీమిండియా స్కోరు 3 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 5 పరుగులు. మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (5 బ్యాటింగ్), కరుణ్ నాయర్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. టీమిండియా విజయానికి ఇంకా 188 పరుగులు చేయాలి. ఈ మ్యాచ్ లో ఇంగ్లండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని 387 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం భారత్ కూడా తన తొలి ఇన్నింగ్స్ లో 387 పరుగులే చేసిన విషయం తెలిసిందే.

తరువాయి పేజీ..

# తీన్మార్ మల్లన్నపై దాడి

ఆగిపోతుందనుకుంటే అది పొరపాటేనని అన్నారు. బీసీల సమస్యలపై తాము ప్రభుత్వంతో పోరాడుతుంటే కవితకు ఎందుకు భాధ అని మల్లన్న ప్రశ్నించారు. కుటుంబ సభ్యులు కేసీఆర్, కేటీఆర్ పై ఉన్న అసహనాన్ని కవిత తమపై ప్రదర్శిస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఇలాంటి దాడులకు పురిగొల్పిన కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అయినా, తాను ఇటువంటి దాడులకు భయపడేది లేదని, మూడేళ్లలో మిమ్మల్ని రాజకీయంగా పాతాళానికి తొక్కడం ఖాయం అని హెచ్చరించారు. అంతకుముందు, ఓ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. బీసీలతో మీకు కంచం పొత్తు ఉందా, మంచం పొత్తు ఉందా అంటూ కవితను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు జాగృతి కార్యకర్తలను తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. ఈ క్రమంలో వారు తీన్మార్ మల్లన్నకు చెందిన క్యూ న్యూస్ కార్యాలయంపై దాడికి దిగారు.





## అమ్మకు బోనం

ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తన అర్ధాంగితో కలిసి ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని తాను ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.









RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

సోమవారం 14 జూలై 2025

quicktodaynews.com



## తీన్మార్ మల్లన్న ఆఫీస్ దాడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- భూపతి నరేష్ గౌడ్**

**మాడుగులపల్లి, జూలై 13 (క్విక్ టుడే న్యూస్)**



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ ఆఫీసు పై దాడి చేయడం సిగ్గుచేటని, బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి భూపతి నరేష్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, పదేండ్లు అధికారంలో ఉండి, బీసీలకు ఏం చేశారనీ. అట్టడుగు, అనగారిన వర్గాలను ఏకం చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆఫీస్ పై కల్వకుంట్ల కవిత అనుచరులు దాడి చేయడం హేమమైన చర్య అని, రాజకీయంగా ఎదుర్కోలేక దాడులు నిర్వహిస్తున్నారని, రాబోయేది బీసీల రాజ్యమని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్టు ఆర్డినెన్స్ తీసుకొస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీల కొరకు చేస్తున్న యుద్ధం వలనేనని కల్వకుంట్ల కవిత గుర్తుంచుకోవాలని అన్నారు. బేషరతుగా వెంటనే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్**



**మిర్యాలగూడ, జూలై 13 (క్విక్ టుడే న్యూస్)**

హైదరాబాదులో బీసీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై దాడి చేయడాని తీవ్రంగా ఖండిస్తున్నామని మిర్యాలగూడ బీసీ యువజన సంఘం సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ... బిసి ఎమ్మెల్సీ అయినటువంటి తీన్మార్ మల్లన్న పై బీ.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత అనుచరులు క్యూ న్యూస్ కార్యాలయం పై మరియు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై దాడి చేయడాని రాష్ట్ర బీసీ సమాజమంతా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అలాగే మల్లన్న గన్మెన్ల పై విచక్షణ రహితంగా దాడి చేసిన తెలంగాణ జాగృతి గుండాలపై పోలీసు వారు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. బీసీ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై దాడి చేసిన వారిని తక్షణమే గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే బీసీలు తిరగబడే అవకాశం కూడా ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలో బీసీలు సహనం కోల్పోతే, కవిత బయట తిరిగే అవకాశం కూడా ఉండదని ఆయన హెచ్చరించారు. కాబట్టి కార్యాలయంపై మరియు మల్లన్న వ్యక్తిగత సిబ్బంది పై దాడి చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోకపోతే బీసీలందరూ పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాసరాజు జయరాజ్, సిద్ధం రాజు, నాయిని భాస్కర్, గంగాధర్, అంజి గౌడ్, ఉపేందర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడక్వాషిని తొలగించి పదోన్నతులు కల్పించాలి

**- బంజారా ఉద్యోగుల సంఘం మిర్యాలగూడ**



**మిర్యాలగూడ, జూలై 13 (క్విక్ టుడే న్యూస్)**

ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు అడ్డంకిగా మారిని అడక్వాషిని తొలగించి పదోన్నతులు కల్పించాలని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, ప్రధానోపాధ్యాయులు గోపి నాయక్, కొండ లింగయ్య, భాష్య లు కోరారు. ఆదివారం మిర్యాలగూడలో జరిగిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతూ, అడాక్వాషి అనేది పదోన్నతులు అడ్డుకోవడానికేనని అన్నారు. ఖాళీ ఏర్పడిన ప్రతి పోస్టులు జనరల్ కేటగిరీ కింద మారతాయని, అటువంటి పోస్టులలో పదోన్నతులు ఇచ్చేటపుడు రోస్టర్ కమ్ మెరిట్ ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఈమేరకు ఎస్సీ, ఎస్టీల ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు. సోమవారం తుంగతుర్తి పర్యటనకు వస్తున్న సి.ఎం దృష్టికి ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు తీసుకవెళ్ళని కోరారు. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయులు సిఎంను కలిసి విన్నవిస్తామని చెప్పారు. సిఎం ప్రత్యేక దృష్టికి సారించి అడక్వాషిని తొలగించి పదోన్నతులు కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సీఎంకు ఎస్సీ, ఎస్టీలపై ప్రత్యేక ప్రేమ వున్నదని, అడక్వాషి ఉత్తర్వులు రద్దు చేస్తారనే నమ్మకం ఉందని అన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం, మందుల సామెలు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్ నాయక్ లు అడాక్వాషి రద్దు విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం చూపాలని కోరారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు మక్లా నాయక్, సైదులు, వడ్డే రాజు, సైదయ్య, జమ్లా నాయక్, బద్దు నాయక్, శంకర్ నాయక్, నెహ్రూ నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి వారి ప్రత్యేక పూజలు

**శివ్వంపేట జూలై 13 (క్విక్ టు డే న్యూస్)**

మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని సికింద్లాపూర్ గ్రామ శివారులో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి మెదక్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దేవాలయంలో స్వామి వారిని దర్శించుకొని లక్ష్మి నరసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపై ఉన్న దేవా లయానికి భక్తులు కాళినడకన చేరుకొని స్వామివారిని ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు, తలనీలాలు సమర్పించారు. కింద దేవాలయంలో స్వామివారిని అభిషేకం, అర్చనలతో పాటు లక్ష్మీనరసింహ్మస్వామి వారి కల్యాణం, వ్రత మండపంలో సమూహిక సత్యనారాయణస్వామి పత్రాలు నిర్వహించి,ఆలయం పక్కన ఉన్న గుండంలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు.క్యూలైన్ల వద్ద భక్తులను ఎట్లాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తునం అని ఆలయాల ప్రధాన అర్చకుడు. దనుంజయ శర్మ ఈవో శశిధర్ తెలిపారు

# రైతులపై కనికరం చూపని కరెంట్ అధికారులు......

**విద్యుత్ సరఫరా లేక పంటలు వేసుకోలేకపోతున్న రైతులు.**

**విద్యుత్ ట్రాన్స్ పార్మర్ కు కనెక్షన్ ఇవ్వాలని రైతుల ఆందోళన.**

**శివ్వంపేట జూలై 13 (క్విక్ టు డే న్యూస్)**

దేశానికి అన్నం పెట్టె రైతన్ననే శివ్వంపేట మండల కరెంట్ అధికారులు ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు.. కాయ, కష్టం చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న అన్నదాతలను మండల విద్యుత్ అధికారులు ఆగమాగం చేస్తున్నారు.పంటలు సాగు చేసుకుందామంటే కరెంట్ అధికారులు కనికరం చూపించడం లేదని, విద్యుత్ ట్రాన్స్ పార్మర్ కు కనెక్షన్ ఇవ్వకుండా కరెంట్ అధికారులు తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ట్రాన్స్ పార్మర్ వద్ద రైతులు ఆందోళన చేపట్టిన సంఘటన మండలంలోని రత్నాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం..గత ఐదు సంవత్సరాల క్రితం రత్నాపూర్ గ్రామానికి చెందిన బొగ్గుల విఠల్, బొగ్గుల గోపాల్, గోపాల మల్లయ్య తమ వ్యవసాయ పొలానికి బోరు మోటార్ల వినియోగం కోసం విద్యుత్ ట్రాన్స్ పార్మర్ గురించి డీడీలు కట్టారు.మూడు డీడీల ప్రకారం అధికారులు రత్నాపూర్ శివారు బాట మీద పొలంలో కరెంట్ ట్రాన్స్ పార్మర్ ను ఏర్పాటు చేసి కనెక్షన్ ఇచ్చి విద్యుత్ సరఫరాను అందజేశారు. కాని అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ పార్మర్ వల్ల పొలంలోకి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని భావించిన రైతులు ట్రాన్స్ పార్మర్ ను అక్కడి నుండి కొంత దూరానికి తరలించారు.ఇదే రైతులు చేసిన పెద్ద తప్పుగా విద్యుత్ అధికారులు భావించి గత యాసంగి పంట నుండి ట్రాన్స్ పార్మర్ కు కనెక్షన్ ఇవ్వకుండా నిలుపుదల చేశారని, ఇప్పుడు వానాకాలం పంటకు కనీసం వరి తుకం కూడ పోసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కరెంట్ అధికారుల చుట్టూ ఎన్నిసార్లు



తిరిగిన కనికరించడం లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, రత్నాపూర్ బంజ నాగయ్య పొలం దగ్గర, బాట మీద పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ పార్మర్ కు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## క్రికెట్ కిట్ అందజేత



**శివ్వంపేట జూలై 13 (క్విక్ టు డే న్యూస్)**

శివ్వంపేట మండలం గంగాయపల్లి గ్రామ యూత్ సభ్యులకు క్రికెట్ కిట్టు బహుకరించారు. గంగాయపల్లికి చెందిన యూత్ సభ్యులు క్రికెట్ ఆడేందుకు కిట్ కావాలని కోరారు. బీఆర్ఎస్ యూత్ విభాగం మండల అధ్యక్షుడు నవీన్ కుమార్ గుప్త యూత్ సభ్యుల కోరిక మేరకు క్రికెట్ కిట్టు అందజేశారు. క్రికెట్ కిట్ అందజేయడం పట్ల యూత్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**తొర్రూరు జూలై 13(క్విక్ టుడే న్యూస్)**

తొర్రూరు మున్సిపల్ పరిధిలోని 2వ వార్డుకు చెందిన కురుమ ముఖేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆదివారం 2వ వార్డు మాజీ కౌన్సిలర్ తూనం రోజా ప్రభుదాస్,కాంగ్రెస్ నాయకులు తూనం శ్రావణ్ కుమార్ సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. పట్టణంలో పేదలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. పేదలకు ప్రతి ఒక్కరు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి బిక్షం గౌడ్, సునీల్ నాగరబొయిన రాజు ఎర్రబోయిన సంతోష్, అనిల్ కుతాటి భరత్ భైంసా రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం



**రాయికల్. జూలై 13(క్విక్ టుడే న్యూస్)**

జగిత్యాల జిల్లా స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగిన ఎన్నికల్లో జగిత్యాల జిల్లా నుండి అత్యధిక ఓట్లతోటి గెలిపించిన స్వర్ణకార సంఘం సభ్యులు ఇట్టి కార్యక్రమంలో. కట్రోజ్ వినోదు. సింహాచారి. వీరి ఇద్దరి పైన 19 ఓట్ల మెజార్టీతోటి మూగల మారుతి జిల్లా అధ్యక్షుడు గెలుపొందారు. శ్రీపాద సంతు. ఉపాధ్యక్షుడు. ఇట్టి కార్యక్రమంలో సహాయ సహకారాలు అందించిన సంఘ సభ్యులు యం. సంజీవ్ చారి.కె . రాజేందర్. టి. రంగయ్య. నరసయ్య. రవి. యస్. గంగాధర్. వి. సుధాకర్. వి. సింహాచారి. కె. సాగర్. యస్. సత్యం. వి. మురళి. యస్. శ్రీనివాస్. టి. గోపి. టి. ప్రసాద్ జగిత్యాల జిల్లా స్వర్ణకార సంఘం సభ్యులందరికీ ధన్యవాదాలు అని తెలపడం జరిగింది

## తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంచిన టిడిపి

**-టిడిపి వరంగల్ పార్లమెంటు ఇంచార్జ్ విద్యాసాగర్ రావు**



**తొర్రూరు జూలై 13(క్విక్ టుడే న్యూస్)**

తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంచిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని టిడిపి వరంగల్ పార్లమెంటు ఇంచార్జ్ అర్షనపల్లి విద్యాసాగర్ రావు అన్నారు.ఆదివారం మండలంలోని వెలికట్ట శివారులో టిడిపి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.టిడిపి మండల అధ్యక్షుడు భోగ భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విద్యాసాగర్ రావు మాట్లాడుతూ....తెలుగువాడి ఆత్మగౌరవ అగ్ని జ్వాలను నాటి ఢిల్లీ పాలకులకు తెలియజేయడం కోసమే తెలుగుదేశం పార్టీ పుట్టిందని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, రాజకీయ స్వాతంత్రం కోసమే ఈ పార్టీ పనిచేస్తుందన్నారు. క్రమశిక్షణ అకుంఠిత దీక్ష, నేర్పు, పట్టుదల కలిగిన విజనరీ నాయకుడిగా చంద్రబాబును యావత్ ప్రపంచం గుర్తిస్తుందన్నారు.నందమూరి తారక రామారావు రూ.2 కు కిలో బియ్యం , పేదలకు ఇండ్లు, జనతా వస్త్రాలు, మహిళలకు ఆస్తి హక్కు వంటి ఎన్నో పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. తదనంతరం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసమే తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని , ఆ పార్టీని అందరూ ఆదరించాలని కోరారు. టిడిపి పట్టణ కమిటీ ఎన్నిక... తొర్రూరు పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టిడిపి పట్టణ కమిటీ అధ్యక్షురాలిగా వెలగపూడి శోభారాణి, ఉపాధ్యక్షులుగా బొలగాని అంజలీదేవి, పట్టణ ప్రధాన కార్యదర్శిగా భోగ స్వప్న, గాదెగొని వెంకన్న, కోశాధికారిగా అనిల్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా దీకొండ శ్రీను, గండి సిద్దయ్య, జాటో రాజేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఆషాడ మాసం పోచమ్మ తల్లికి బోనాల ఉత్సవాలు

**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు**





**రామగుండం జులై 13 (క్విక్ టుడే న్యూస్)**

గోదావరిఖని ఆర్జి-1 ఏరియా సింగరేణి బంగ్లాస్ ఏరియాలో ఘనంగా నిర్వహించిన ఆషాడ మాసం పోచమ్మ తల్లికి బోనాల ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా రామగుండం రాజ్ ఠాగూర్ సతీమణి మనాలి ఠాగూర్ పాల్గొన్నారు అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన మనాలి ఠాగూర్, స్థానిక మహిళలతో కలిసి ఉత్సాహంగా బోనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాంప్రదాయపరంగా ప్రతి ఇంటిలో పోచమ్మ అమ్మవారు కుటుంబానికి రక్షణ కలిగించే దేవతగా ఆరాధించబడతారు. ఇటువంటి ఉత్సవాలు మన సంస్కృతిని, సమైక్యతను, భక్తిని ప్రతిబింబిస్తాయి. ఈ పర్వదినాన్ని పెద్దఎత్తున నిర్వహించిన స్థానికులు, మహిళా సమితి సభ్యులకు ప్రత్యేక అభినందనలు అని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళా సంఘాలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో తదితరుల పాల్గొన్నారు అమ్మవారి మేళాలు, డప్పుల మధ్య జాతర వాతావరణం ఏర్పడింది

RNI NO : TELTEL/2023/86487
క్విక్ టుడే
CINEMA
QUICK TODAY
quicktodaynews.com
సోమవారం 14 జూలై 2025




# కూలిన కోట



నటుడిగా, విలన్‌గా నటించారు. టాలీవుడ్ అగ్రహీరోలు సూపర్ స్టార్ కృష్ణ, చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, వెంకటేశ్, మహేశ్‌బాబు, పవన్ కల్యాణ్, సాయిధరమ్ తేజ్ వంటి పాత, కొత్తతరం నటులతో కలిసి నటించారు. ప్రతిఘటన సినిమాతో ఆయన పేరు తెలుగు చిత్ర పరిశ్రమలో మార్మోగిపోయింది. అహనా పెళ్లంట సినిమా ఆయనలోని మరో నటుడిని వెలికితీసింది. అందులో ఆయన నటించిన పిసినారి పాత్ర నభూతో నభవిష్యత్. ఇక, ఖైదీ నంబర్ 786, యముడికి మొగుడు, బొబ్బిలి రాజా, యమలీల, శివ, సంతోషం, బొమ్మరిల్లు, అతడు, రేసుగుర్రం, ఇంట్లో ఇల్లాలు.. వంటింట్లో ప్రియురాలు వంటి సినిమాలు ఆయనకు ఎనలేని పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి.

### ముగిసిన అంత్యక్రియలు...

హైదరాబాద్ సిటీలోని జూబ్లీ హిల్స్ ఏరియాలో గల కోట శ్రీనివాస రావు నివాసం నుంచి మహా ప్రస్థానం వరకు అంతిమ యాత్ర జరిగింది. కుటుంబ సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కన్నీటితో కడసారి వీడ్కోలు పలికారు. మహా ప్రస్థానంలోని మనవడి చేతుల మీదుగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కోట శ్రీనివాస రావుకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. ఆయన తనయుడు కోట వెంకట ఆంజనేయ ప్రసాద్ కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. అందువల్ల, పెద్ద మనవడు కోట ప్రసాద్ తనయుడు చేతుల మీదుగా అంతిమ కార్యక్రమాలు నిర్వహించారు.

### ప్రముఖుల నివాళులు..

కోట శ్రీనివాస రావుకు నివాళులుకోట శ్రీనివాస రావు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహా పలువురు రాజకీయ ప్రముఖులు కోట శ్రీనివాస రావు పార్థీవ దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్, దర్శక ధీరుడు రాజమౌళి, నటకిరీటి డా రాజేంద్ర ప్రసాద్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, రానా దగ్గుబాటి, శేఖర్ కమ్ముల, అనిల్ రావిపూడి సహా పలువురు సినీ ప్రముఖులు సైతం నివాళులు అర్పించారు. కోట పార్థీవ దేహాన్ని చూసి బ్రహ్మానందం కన్నీటి పర్యంతం అయ్యారు. తన ఆప్తమిత్రుడు తనను వదిలి వెళ్లిపోయాడని బాబూ మోహన్ ఎమోషనల్ అయ్యారు.











**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District, Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com